క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న లాయఖ్ అలీ

భువనగిరిటౌన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిధిలో గల మసీద్ ఏ ఖుబా (పాతిమ) కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం మజీద్ కమిటీ గౌరవ అధ్యక్షుడు ,నాయబ్ తహసీల్దార్ మొహమ్మద్ లాయఖ్ అలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఖలీల్, ఖలీల్ ఖాన్, మసీద్ పెద్దలు యూనుస్,అబ్దుల్ రహీమ్, షానూర్, ఆజాం, ఇమామ్ అతల్లాహ్, ఆరిఫ్, అన్వర్, చోటు, ఉబేర్, అఖిల్ చౌదరి, తౌఫిక్, కరీం, హదిస్, సోను, సోహెల్, రబ్బానీ, మజీద్, బషీర్, అన్వర్, ఇబ్రహీం పాల్గొన్నారు.

బీజేపీ చేనేత సెల్ మండల కన్వీనర్‌గా సత్యనారాయణ

చౌటుప్పల్ : బీజేపీ చేనేత సెల్ మండల కన్వీనర్‌గా వనం సత్యనారాయణను నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు చినుకని మల్లేష్ బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వనం సత్యనారాయణ మాట్లాడుతూ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పోచంపల్లి అర్బన్ బ్యాంకు సమావేశం

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని టై అండ్ డై అసోసియేషన్ భవనంలో గురువారం సాయంత్రం పోచంపల్లి అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ మంజూరు, బ్యాంకు డిపాజిట్లు, వాయిదా మీరిన బాకీలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

'ఉచిత విద్య, వైద్యం అందిస్తాం'

ఆలేరురూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ వ్యవస్థాపకుడు వి.సదానందరెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను ప్రలోభాలతో మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్నారని విమర్శించారు. సమాజంలో యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక సతమతమవుతుంటే ప్రభుత్వాలు చీమకుట్టినట్లుగా లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్ ప్రొటెక్షన్ పార్టీని ఆదరించి గెలిపిస్తే ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారు.

108 వాహనం తనిఖీ

వలిగొండ : మండలకేంద్రంలోని 108 వాహనాన్ని బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నజీరుద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రజలు 108 వాహనాన్ని వినియోగించుకోవాలన్నారు. వాహనంలో వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా అధికారి శివరాం, 108సిబ్బంది దినేష్, నరేష్, వర్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జ్యోతి

ఆత్మకూరు(ఎం): అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ మోత్కూరు ప్రాజెక్టు సూపర్ వైజర్ జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని రహీంఖాన్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.అనంతరం చిన్నారులకు అసైన్‌మెంట్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, మమత పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై సమీక్ష

తుంగతుర్తి : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో, బీఎల్‌ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఫారం–8 ద్వారా ఓటర్లు తమ ఓటును షిఫ్టింగ్ చేసుకోవచ్చని తెలిపారు. 85ఏళ్లు నిండిన ఓటర్లు 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారికి బ్యాలెట్ ఓటు కల్పించబడుతుందని అన్నారు. గ్రామాల్లో రాజకీయాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు ఉంటే వాటిని గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ స్వప్న, ఆయా పార్టీల రాజకీయ నాయకులు తాటికొండ సీతయ్య, మల్లేపాక సాయిబాబు, ఉప్పుల రాంబాబు, అజయ్‌కుమార్, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారెడ్డి

విస్తరణలో జాప్యం.. ప్రజలకు శాపం

- నిలిచిపోయిన ఖప్రాయపల్లి–మోత్కూరు రోడ్డు పనులు
- దుమ్ము, కంకరతో ప్రయాణికుల అవస్థలు



కంకర తేలి ఉన్న మోత్కూరు-ఖప్రాయపల్లి రోడ్డు



దుమ్ము లేస్తున్న మట్టి రోడ్డు

మోత్కూరు : మోత్కూరు – రాయగిరి రోడ్డు ప్రయాణికులకు నరకం చూపుతోంది. దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం పనులను ప్రారంభించినా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆత్మకూరు(ఎం) మండలం ఖప్రాయపల్లి నుంచి మోత్కూరు పట్టణంలో పనకబండ చౌరస్తా వరకు 3.6 కిలో మీటర్ల మేర రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించేందుకు 2021 – 22లో ఆర్థిక సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూ.5.80 కోట్లు మంజూరు చేసింది. 2024 జనవరి 24న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న సీ్‌ఇన్‌ఫ్రా కంపెనీ నెల రోజుల పాటు చురుగ్గా పనులు చేపట్టింది. అర కిలో మీటరు దూరం రోడ్డును విస్తరించి మట్టితో రోలింగ్ చేయించారు. మరో అర కిలోమీటరు దూరం పాత రోడ్డును తవ్వి వెడల్పు చేసి వదిలేశారు. మరో అర కిలో మీటరు ఒక వైపు తవ్వి వదిలేశారు. ఓ పక్క దుమ్ము లేవడం, మరో పక్క కంకరతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దుమ్ము కారణంగా రోగాల బారిన పడుతున్నామని రోడ్డు వెంబడి ఉన్న రాజన్నగూడెం గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

రివైజ్డ్ ఎస్టిమేషన్

రోడ్డు విస్తరణకు 2021 – 22లో ఆర్థిక సంవత్సరంలో రూ.5.80 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం రూ.7.90 కోట్ల అంచనా వ్యయంతో తిరిగి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. భవిష్యత్‌లో నా లుగు లేన్లకు అనుగుణంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు.

డీఈఈ వివరణ

కాంట్రాక్టర్ అర్ధాంతరంగా రోడ్డు విస్తరణ పనులు నిలిపివేశారని ఆర్‌అండ్‌బీ రామన్నపేట డీఈఈ షెహనాజ్ వివరణలో తెలిపారు. పనులు తిరిగి చేపట్టేందుకు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇస్తామని తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి



ఖప్రాయపల్లి – మోత్కూరు రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలి. రోడ్డును తవ్వి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులను ప్రారంభించేలా దృష్టి సారించాలి.

–గుండు వెంకటనర్సు, సీపీఎం మండల కార్యదర్శి

దుమ్ము ఇళ్లలోకి వస్తోంది



రాజన్నగూడెం రోడ్డుకు ఆనుకుని ఉంది. చాలా ఇళ్లు రోడ్డు వెంట ఉన్నాయి. రోడ్డును తవ్వి వదిలేయడంతో వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము ఇళ్లలోకి వస్తుంది. వేసవి కావడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించే కొద్దికాలానికే నిలిపివేశారు. వెంటనే ప్రారంభించాలి.

– మహిపాల్‌రెడ్డి, రాజన్నగూడెం

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ కేంద్రంలోని లక్ష్మీ నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలు, మహిళల కోలాటాల మధ్య పురవీధుల గుండా స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. బ్లాక్‌కాంగ్రెస్‌అధ్యక్షుడు తడక వెంకటేశం, కౌన్సిలర్ మోటె రజితరాజు, సార బాలయ్యగౌడ్, అంకం మురళి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో దేవాలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ అంకం వినోద్, ధర్మకర్తలు మోటె మహేశ్, చేరాల సుధీర్, వేశాల మురళి, కూరపాటి బాబు, నాగయ్య, జి. సుభాష్, పెద్దల ముత్యాలు, రాములు, బాలాజీ, పొనమోని కావ్య, వంగూరి బాలకృష్ణ, పాపని ముత్యాలు, వెంకటేశం, శివకుమార్, జినుకల కుమార్, మూశం శ్రీను, చెరుకు శ్రీకాంత్, జినుకల శ్రీకాంత్, బోడ సత్యనారాయణ, గణేశ్, చేరాల శ్రీకాంత్, మహేందర్‌రెడ్డి, చేరాల మహేందర్, ఆలయ ప్రధాన అర్చకులు గిరిధరచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న ఎయిమ్స్ వైద్యులు

బీబీనగర్: మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎయిమ్స్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ రాహుల్‌నారంగ్, వైద్యులు కిషోర్‌యాదవ్, గోవిందరావు, అనూష, దీప్తి, సాయికృష్ణ, దేబాసిస్, కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని వైన్స్ నుంచి మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు. భువనగిరి మండలంలోని సూరెపల్లి గ్రామానికి చెందిన గొలనుకొండ లింగస్వామి వైన్ షాపు నుంచి 12 బీరు బాటిళ్లు, 111 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసుల కవాతు

చండూరు : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బుధవారం చండూరు పట్టణంలో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కవాతులో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐలు ఉప్పు సురేష్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆత్మకూరు(ఎం): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను తీసుకొస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆరు గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ తప్పక అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బూడిద శేఖర్ గౌడ్, రంగ పరశరాములు, ఆలేటి నరసింహ, కొండపల్లి సాంబ ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, నాయకులు గుండెగాని అయిలయ్య పాల్గొన్నారు.

సమాజంలో అసమానతలు తొలగాలి



మాట్లాడుతున్న బేజాడీ కుమార్

భూదాన్‌పోచంపల్లి : సమాజంలో అసమానతలు తొలగాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా ప్రధానకార్యదర్శి బేజాడీ కుమార్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మతం పేరిట ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నేటి యువత అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పీడన, దోపిడిలేని నూతన సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పగడాల శివ, జిల్లా సహాయకార్యదర్శి చిరబోయిన బాలకృష్ణ, ఆకుల కృష్ణ, రాచకొండ ఉదయ్, ఆరే ఉదయ్‌కిరణ్, సూరిబాబు, సుధాకర్, సతీష్, గోవర్ధన్, మహేశ్, సతీష్, సాయి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్ : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి అన్నారు. కైతాపురం గ్రామంలో నిర్వహించిన కైతాపురం–ఎల్లగిరి–తూప్రాన్‌పేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ. 60వేల నగదు, షీల్డు, ద్వితీయ బహుమతిగా రూ. 30వేల నగదు, షీల్డు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ఓటమికి కుంగిపోవద్దన్నారు. ఓటమి గెలుపుకు సంకేతమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని స్నేహబంధాలు ఏర్పడతాయన్నా రు. కార్యక్రమంలో ఎల్లగిరి మాజీ సర్పంచ్ రిక్కల ఇందిరాసత్తిరెడ్డి, నాయకులు కందగట్ల పద్మారెడ్డి, రిక్కల బాలకృష్ణారెడ్డి, జంగారెడ్డి, నిర్వాహకులు ఎండీ ఇబ్రహీం, జంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, మన్నె ప్రవీణ్‌రెడ్డి, వెల్మ రామలింగేశ్వర్‌రెడ్డి, బక్కతట్ల యాదగిరి, శ్రీశైలం పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : ధరణి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శక్తి మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దళిత ఐక్యవేదిక నాయకుడు కర్తాల శ్రీనివాస్ బుధవారం జాయింట్ కలెక్టర్ బెన్ షాలోమ్‌కు వినతిపత్రం అందజేశారు. వివిధ భూ సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ నేటికీ పరిష్కారం చూపలేదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక కన్వీనర్ బట్టు రాంచంద్రయ్య , మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, ఇటుకల దేవేందర్, సురుపంగ శివలింగం,రిటైర్డ్ ఎంఈఓ బండారు రవివర్ధన్, గ్యాస్ చిన్న ,శివ, పిట్టల బాలరాజ్ తదితరులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్‌ను కలిసిన సామల వెంకటేశ్

భువనగిరి రూరల్ : బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ యాదవ్‌ను బుధవారం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సామల వెంకటేశ్ కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

మల్లేశ్ గౌడ్‌కు పరామర్శ

భువనగిరి రూరల్ : మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్లమాస రవి గౌడ్ తండ్రి మల్లేశ్ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మల్లేశ్ గౌడ్‌ను బుధవారం నిరుద్యోగ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ చిరంజీవి నాయక్ పరామర్శించారు. ఆయ న వెంట మచ్చ నవీన్ గౌడ్, పొలిచెలిమి రామకృష్ణ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ధ్వజస్తంభాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేస్తున్న భక్తులు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని గుజ్జ గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ధ్వజ స్తంభం, శివలింగం, గణపతి, కుమారస్వామి, అభయాంజనేయ స్వామి విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. విగ్రహాలకు గ్రామస్తులు జలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు : తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. గుర్రం కవితను మున్సిపల్ చైర్‌పర్సన్‌ను చేయడంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తనకు ఎంతో సహకరించారన్నారు. మోత్కూరులో ఆర్టీసీ డిపో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం కృషి చేస్తున్నానన్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు తొలగించుకునే వారు ఇళ్లను తొలగించుకుని సహకరించాలన్నారు. మోత్కూరు మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.10 కోట్లు మంజూరు చేయించానన్నారు. బునాదిగాని కాల్వను పూర్తి చేయించేందుకు అసెంబ్లీలో మాట్లాడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుక పోయానని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జి.లక్ష్మినర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్ కుమారస్వామి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ముద్దం జయశ్రీ, కాంగ్రెస్ నాయకులు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కారుపోతుల వెంకన్న పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారు వీరే :

సింగిల్‌విండో డైరెక్టర్ ముత్యాలు, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పోచం భిక్షపతి, హమాలీ సంఘం అధ్యక్షులు కూరెళ్ల రాములు, సీఐటీయూ అధ్యక్షులు సామ శ్రీనివాస్‌రెడ్డి, సెంట్రింగ్ సంఘం అధ్యక్షులు జంగ సతీష్, టైలర్ల సంఘం అధ్యక్షులు జిల్లా రవి, పండ్లబండ్ల సంఘం అధ్యక్షులు పోతరబోయిన నర్సింహ, బాలెంల మధు, మొగుళ్ల నర్సిరెడ్డి, కళ్లెం నర్సయ్య, మన్నె మల్లయ్య, బీసు రవి, కురిమి లచ్చయ్య, వడకాల యాదగిరి, రేగోటి ఉషారాణి, దోర్నం సుజాత, మర్రి మల్లయ్య, కూరెళ్ల వీరపెద్దులు, పల్లె భిక్షం, కూరెళ్ల వెంకన్న, దాదా సాహెబ్, షేక్ సయ్యద్‌లతో పాటు పలువురు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి

రామన్నపేట : గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, జెడ్పీటీసీ పున్న లక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పారిశుద్ధ్యం మెరుగుపరచి, నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త పడాలన్నారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రామన్నపేట–ఎన్నారం, రామన్నపేట–అమ్మనబోలు రోడ్లకు మరమ్మతులు చేయాలని ఎంపీటీసీలు వేమవరపు సుధీర్‌బాబు, దోమల సతీష్, వెల్లంకి–గుండ్రాంపల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ ఎర్రోళ్ల లక్ష్మమ్మ కోరారు. కుంకుడుపాములకు మిషన్ భగీరథ నీళ్లు సరిపడా రావడం లేదని ఎంపీటీసీ ఏనుగు పుష్ప సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి, ఎంపీడీఓ యాకుబ్ నాయక్, వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు నర్సింహ, హర్షిని, లక్ష్మమ్మ, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, పద్మ, జ్యోతి, గాదె పారిజాత, సతీష్, పుష్ప, సుధీర్‌బాబు పాల్గొన్నారు.

దుప్పట్లు, బియ్యం అందజేత



దుప్పట్లు, బియ్యం అందజేస్తున్న రామానందప్రభుజీ

బొమ్మలరామారం : మండలంలోని పెద్దపర్వతాపూర్ గ్రామంలో గల సాయిధామం ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ సత్యప్రధానంద ప్రభుజీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు, వృద్ధులకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యప్రధానంద ప్రభుజీ ఆశయమైన సేవమార్గాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామానంద ప్రభుజీ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చీమలకొండూర్‌లో..

భువనగిరి రూరల్ : మండలంలోని చీమలకొండూర్ గ్రామంలో కడగంచి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మంగ జమాల్ లక్ష్మీ జ్ఞాపకార్థం మృతుడి కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని చిన్నం శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగ శ్రీశైలం, సత్తయ్య, నర్సయ్య, శ్రీశైలం, మల్లయ్య, విజయ్‌కుమార్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు: మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం కొనసాగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు గౌడ్ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పైళ్ల సోమిరెడ్డి, పేలపూడి సత్యనారాయణ చౌదరి, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కారుపోతుల వెంకన్న, సభ్యులు బయ్యని రాజు, కోమటి మత్స్యగిరి, అంజయ్య, యాదగిరి, శ్రీను, శ్రీనాథ్, రామలింగం శర్మ, నాగరాజు పాల్గొన్నారు.

సంతలో ట్రాఫిక్ సమస్య

- పార్కింగ్ స్థలం లేకపోవడంతో రహదారికి ఇరువైపులా నిలుపుతున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వ్యాపారులు
- సమస్యను పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



రాజాపేటలో సంతలో నిలిపిన వాహనాలు



రోడ్డుకు ఇరువైపులా నిలిపిన ద్విచక్ర వాహనాలు

రాజాపేట : మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారాంతపు సంతలో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంతకు జగదేవ్‌పూర్, బచ్చన్నపేట, ఆలేరు, జనగాం, బచ్చన్నపేట, యాదగిరిగుట్ట మండలాలకు చెందిన వ్యాపారులు వస్తుంటారు. సంతకు వచ్చేవారంతా తమ వాహనాలను ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నిలుపుతుండడం.. రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తుండడం, పండ్ల బండ్లు వరుసగా బారులుతీరి నిలబెడుతుండడంతో రోడ్డు కుచించుకుపోయి కనీసం కాలినడకన వెళ్లేందుకు కూడా అపసోపాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతూ ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు బేజారెత్తిపోతున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించకుండా గ్రామ పంచాయతీ అధికారులు, పోలీస్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు..

మండల కేంద్రంలో సరైన పార్కింగ్ స్థలం లేదు. దీంతో వారాంతపు సంతకు వచ్చేవారంతా తమ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలుపుతున్నారు. మండల కేంద్రంలో వాహనాలు పార్కింగ్ స్థలం కేటాయించడంతో పాటు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ద్విచక్రవాహనాలు, ఆటోలు, తోపుడు బండ్లు నిలుపకుండా చర్యలు తీసుకున్నా వారాంతపు సంతో ట్రాఫిక్ సమస్య ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు జోక్యం చేసుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రతి గురువారం నిర్వహించే వారాంతపు సంతలో రోడ్డుపై వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీంతో కాలినడకన కూడా రోడ్డు దాటలేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి వారాంతపు సంతలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

– మాయకోటి రాజు, నెమిల

సమస్యను పరిష్కరిస్తాం



గాంధీ సెంటర్‌లో నిర్వహించే సంతను గ్రామం శివారులో శ్రీ వెంకటేశ్వర స్వామి (మఠం) వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. రోడ్డుకు ఇరువైపులా ఒకే వైపు వ్యాపారస్తులు తమ షాపులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపాం. వారాంతపు సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సమస్యను పరిష్కరిస్తాం.

– సుధాకర్‌రెడ్డి రాజాపేట ఎస్‌ఐ